క్లుప్తంగా

డ్రెయిన్ల నిర్వహణపై చైర్‌పర్సన్ ఆగ్రహం



తెనాలి అర్బన్: మురుగు కాల్వలను బాగు చేసి ఎంత కాలమైంది.. కాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోయి ఉన్నాయి.. ఇలా ఉంటే వ్యాధులు ప్రబలవా? అంటూ మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని 22వ వార్డులో గురువారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. మురుగు కాల్వలు అధ్వానంగా ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రతిరోజుబాగు చేయాలని సూచించారు. ఆమె వెంట అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతి, కౌన్సిలర్ షేక్ దుబాయ్ బాబు, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, టీపీవో సాంబశివరావు, ఏఈ సునీల్‌కుమార్ ఉన్నారు.

బహిరంగ మల,మూత్ర విసర్జన నిషేధం

తెనాలి అర్బన్: బహిరంగ మల,మూత్ర విసర్జనరహితంగా పట్టణాన్ని తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న గురువారంఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెనాలి పట్టణంలో బహిరంగ మల మూత్ర విసర్జనను నిషేధించినట్లు ప్రకటించారు. అందుకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై రూ.500 జరిమానా విధించనున్నట్లు హెచ్చరించారు. ప్రజలందరూ వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలని ఆయన సూచించారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

తెనాలి రూరల్:ఇంటర్ విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదైంది. పట్టణంలోని చెంచుపేటకు చెందిన 17 ఏళ్ల బాలిక ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. ఇంటి నుంచి కళాశాలకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులను గురువారం ఆశ్రయించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా క్రిస్మస్ ఉదయ కాల ప్రార్థనలు



తెనాలి: పట్టణ అయితానగర్ ప్యాడిసన్‌పేటలోని ఈరే న్యూ లైఫ్ ఫ్యామిలీ వర్షిప్ సెంటర్‌లో నవంబర్ 25 నుంచి ప్రారంభమైన క్రిస్మస్ మాస ఉదయకాల ప్రార్థనలు మహిమకరంగా జరుగుతున్నాయి. గురువారం ఉదయం జరిగిన ప్రార్థనలో పలువురు దైవజనులు పాల్గొన్నారు. తెనాలి యునైటెడ్ టౌన్ పాస్టర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, ఈరే మినిస్ట్రీస్ అధ్యక్షుడు బిషప్ కె.సుధీర్ కుమార్ మాట్లాడుతూ క్రీస్తు పుట్టుక ఈ లోకానికి వెలుగని చెప్పారు. ఉదయకాల ప్రార్థనతో అనేక ఆశీర్వాదాలు కలుగుతాయని చెప్పారు. ఈనెల 25వ తేదీ క్రిస్మస్ వరకు ఈ ఉదయ కాల ప్రార్థనలు జరుగుతాయని వెల్లడించారు. దైవజనులు వై.కృపాదానం, పి.గిద్యోను, బ్రదర్ ఆనందన్న, రెవరెండ్ పి.శామ్యూల్, బ్రదర్ అబ్రహంరెడ్డి బోయిన, రెవరెండ్ మార్పు స్టీఫెన్, రెవరెండ్ గాబ్రియేలు, జోసఫ్ చిట్టిబాబు దానియేలురాజు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడి అమానుషం

గుంటూరు మెడికల్: గత కొద్ది రోజులుగా బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను యావత్ హిందూ సమాజం, హిందూ ఐక్య వేదికగా తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ తెలిపారు. అక్కడ ఇస్కాన్‌కి సంబంధించిన చిన్మయ కృష్ణ దాస్, ఆదిపురుష శ్యామ్ దాస్, రంగానంద్ దాస్‌ను అరెస్టు చేసి వారి మీద అభియోగం మోపడం తీవ్రమైన చర్యగా భారత దేశ ప్రజలందరూ భావిస్తున్నారని పేర్కొన్నారు. వారి ముగ్గురిని అరెస్టు చేయడమే కాకుండా వారి తరఫున లాయర్‌గా ఉన్న వ్యక్తిపై కూడా తీవ్రంగా దాడి చేసి భయాందోళనలు కలిగించినట్లు వెల్లడించారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి

లక్ష్మీపురం: ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి డిమాండ్ చేశారు. 41 డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, పల్లెల్లో మూడు సెంట్లు స్థలం కేటాయించాలని కోరారు. ఆ స్థలంలో గృహ నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పేదలతో వ్యక్తిగత అర్జీలు పూర్తి చేయించి సచివాలయ అడ్మిన్‌కు అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ డివిజన్ కార్యదర్శి చేపర్తి కృష్ణారావు, కృష్ణ, నాగేంద్రం, మాధవి, చిరు వ్యాపారుల సంఘం నాయకులు సైదారావు, శీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే పేరిట ఆర్పీల దందా

- డ్వాక్రా మహిళల నుంచి అక్రమ వసూళ్లు
- గ్రూప్‌కు రూ.500 నుంచి వెయ్యి డిమాండ్
- తెనాలిలో చేతులు మారిన రూ.రెండు లక్షలు
- ఆవేదన చెందుతున్న డ్వాక్రా సంఘ సభ్యులు



తెనాలి పురపాలక సంఘ కార్యాలయంలోని మెప్మా విభాగం

తెనాలి అర్బన్: పట్టణంలోని మెప్మా విభాగంలో పనిచేసే రిసోర్స్ పర్సన్(ఆర్పీ)ల దందాకు అడ్డూ అదుపులేకుండా ఉంది. వ్యక్తిగత లోన్‌లు దగ్గర నుంచి ప్రతి కార్యక్రమానికి సభ్యుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడటం పరిపాటిగా మారింది. చివరకు ప్రభుత్వం ఆదేశించిన సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ (ఎస్‌హెచ్‌జీ) సర్వేను కూడా ఆదాయ వనరుగా మార్చుకున్నారు. ఒక్కో సభ్యురాలి నుంచి రూ.500నుంచి 1000 వసూలు చేస్తూ దందాకు తెరతీశారు.

87 మంది ఆర్పీల పర్యవేక్షణ

తెనాలి పట్టణ పరిధిలో 2,810 డ్వాక్రా సంఘాలున్నాయి. వీటిలో 28,100 మంది సభ్యులున్నారు. వీరి పర్యవేక్షణను పట్టణంలోని 87 మంది ఆర్పీలు చూస్తుంటారు. 10 మంది సభ్యులను గ్రూప్‌గా ఏర్పాటు చేయడం, వ్యక్తిగత, గ్రూప్ రుణాలు ఇప్పించడం తదితర విధులను ఆర్పీ చూస్తుంటారు. వీరి పర్యవేక్షణను తెనాలి పురపాలక సంఘ కార్యాలయంలోని మెప్మా విభాగ సిటీ మిషన్ మేనేజర్ చూస్తుంటారు. సభ్యులుగా చేరిన మహిళలకు ఆర్థిక చేయూత ఇచ్చేందుకు సహాయకారిగా ఉంటారు. వివిధ వృత్తుల (టైలరింగ్, ఎంబ్రాయిడరీ, పూసల దండలు చేయడం, అల్లికలు, పిండి వంటలు చేయడం)పై శిక్షణ కల్పిస్తారు. ఆ రంగంలో జీవనోపాధిని కల్పించే విధంగా చూస్తుంటారు. డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెట్ కల్పించేందుకు అర్బన్ బజారులను నెలలో రెండు రోజులు ఏర్పాటు చేస్తుంటారు.

కలిసొచ్చిన ఎస్‌హెచ్‌జీ సర్వే

డ్వాక్రా సంఘ సభ్యుల వివరాలు సేకరించేందుకు ప్రభుత్వం సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ సర్వేను నవంబర్‌లో ప్రవేశపెట్టింది. దానికోసం ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో సభ్యుల వివరాలు నమోదు చేయాలని ఆర్పీలను ఆదేశించింది. దీంతో వారు సభ్యుల ఆధార్, పాన్ కార్డు, వ్యక్తిగత రుణాలకు సంబంధించిన వివరాలు, పాస్‌పోర్ట్ ఫొటో, వృత్తులు చేసే ఫొటో సేకరిస్తున్నారు. గ్రూప్ లీడర్ నుంచి రుణాలు ఎన్ని సార్లు తీసుకున్నారు.. ఎంత చెల్లించారు.. ఎంత చెల్లించాల్సి ఉంది ? అనే వివరాలు సేకరించి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ వివరాలు యాప్‌లో నమోదు చేసినందుకు మొదట్లో సభ్యుల వద్ద ఒక్కొక్కరి నుంచి రూ.50 చొప్పన గ్రూప్‌కు రూ.500 వసూలు చేశారు. తర్వాత నుంచి దాని రేటును రూ.100కు పెంచి, గ్రూప్ నుంచి రూ.1000 వసూలు చేస్తున్నారు. నగదు ఎందుకని ఏవరైనా ప్రశ్నిస్తే ప్రభుత్వం నుంచి ఎటువంటి లబ్ధి చేకూరకుండా చేస్తామంటూ ఆర్పీలు బెదిరిస్తున్నారు. తెనాలిలో సర్వే పేరిట ఇప్పటి వరకు రూ.రెండు లక్షలు వసూలు చేశారనే గుసగుసలు మెప్మా విభాగంలో విన్పిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సర్వే పేరిట చేస్తున్న అక్రమ వసూళ్ల పర్వాన్ని ఆపడంతో పాటు ఆర్పీలపై చర్యలు తీసుకోవాలని డ్వాక్రా మహిళలు కోరుతున్నారు.

నగదు ఇవ్వొద్దు



ఎస్‌హెచ్‌జీ సర్వే పేరిట కొందరు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు నా దృష్టికి రాలేదు. డ్వాక్రా సంఘ సభ్యుల వివరాలు నమోదు చేసినందుకు ఎటువంటి నగదు చెల్లించాల్సిన అవసరం లేదు. ఎవరైనా అడిగితే నాకు తెలియజేయండి. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటాం.

–బండి శేషన్న, మిషనర్, తెనాలి పురపాలక సంఘం.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు



సర్పంచులు, వీఆర్వోలకు సూచనలు చేస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలి రూరల్: తెనాలి మండల గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను శుక్రవారం నుంచి న్విహించనున్నారు. ఈ మేరకు షెడ్యూలును తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ గురువారం విడుదల చేశారు. 6న నందివెలుగు, 7న సంగంజాగర్లమూడి, 12న కొలకలూరు, 17న మల్లెపాడు, 19న గుడివాడ, 21న పెదరావూరు, 24న గుడివాడ పరిధిలోని దేవరపల్లి సేరి, 26న అంగలకుదురు, 28న కఠెవరం, 31న బుర్రిపాలెం, జనవరి 2న చినరావూరు, 4న నేలపాడు, 8న ఐతానగర్‌లో రెవిన్యూ సదస్సులు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ప్రతి రోజు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సభలు జరుగుతాయని పేర్కొన్నారు.

అర్జీల పరిష్కరంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

గ్రామ సభల్లో వచ్చే అర్జీలను పరిష్కరించడంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తహసీల్దార్ గోపాలకృష్ణ ఆదేశించారు. మండల గ్రామాల్లోని వీఆర్వోలు, సర్పంచులతో గురువారం సాయంత్రం ఆయన తన కార్యాలయంలో సమావేశమయ్యారు. సదస్సుల్లో వచ్చే అర్జీల పరిష్కారం కోసం త్వరితగతిన చర్యలు తీసుకునేలా సిద్ధంగా ఉండాలని సూచించారు. అర్జీలకు ఎటువంటి రుసుం చెలించాల్సిన అవసరం లేదని తెలిపారు. అర్జీని స్వీకరించి రశీదును తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. వచ్చిన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి క్షేత్ర సందర్శనలో ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.

బహిరంగ ప్రదేశాల్లో మందులు దహనం

విచారణ జరుపుతున్న వైద్యాధికారులు



బూడిదైన మందులు

తెనాలి అర్బన్: పేదలకు పంపిణీ చేయాల్సిన మందులను అర్బన్ హెల్త్ సెంటర్ ఉద్యోగులు బహిరంగ ప్రదేశంలో దహనం చేయడం సంచలనంగా మారింది. ఈ సంఘటన తెనాలి సుల్తానాబాద్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద గురువారం ఉదయం వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే .. తెనాలి సుల్తానాబాద్‌లో అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. రోగులను అవసరమైన మందులను ప్రభుత్వం సరఫరా చేసింది. వాటిలో సుమారు 25 బాక్స్‌ల మందులను సమీపంలో చెత్త వేసి తగులపెట్టారు. స్థానికులు గమనించి మీడియాకు సమాచారం ఇచ్చారు. వీటికి గత నెలలో కాల పరిమితి ముగియడంతో సిబ్బంది తగులబెట్టినట్లు అక్కడి వైద్యులు తెలిపారు. సుల్తానాబాద్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్ ముందు మందులను తగులపెట్టిన విషయం తన దృష్టికి వచ్చిందని తెనాలి డెప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ తెలిపారు. కాలపరిమితి ముగిసిన మందులను నిబంధనల ప్రకారం బయో మెడికల్ వేస్ట్‌ను సేకరించే సిబ్బందికి అందజేయాల్సి ఉందని చెప్పారు. కానీ నిబంధనలకు విరుద్ధంగా దహనం చేయడంపై విచారణ జరుపుతున్నామని చెప్పారు. ఎన్ని బాక్స్‌ల మందులు తగులపెట్టారు ? అనే విషయం తెలియాల్సి ఉందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాసరావు

పాతబొమ్మువానిపాలెం(కొల్లిపర): సైబర్ నేరాలపై మహిళలు, రైతులు అవగాహన పెంచుకోవాలని తెనాలి రూరల్ సీఐ బెల్లం శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని పాతబొమ్మువానిపాలెంలో గురువారం రాత్రి వారధి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు. డ్వాక్రా మహిళలకు, రైతులకు సైబర్ నేరాలతో పాటు అవి జరిగే విధానాన్ని వివరించారు. బ్యాంకుల నుంచి డబ్బులు తెచ్చే సమయంలో అపరిచితులతో, అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. మాయ మాటలు నమ్మవద్దని, అనుమానం వస్తే వెంటనే అక్కడ ఉన్న బ్యాంకు మేనేజర్ గానీ దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌లో గానీ సమాచారం అందించాలని సూచించారు. ఫోన్‌కు వచ్చే ఓటీపీలు చెప్పమని అడిగే వారితో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఎస్ఐ పి.కోటేశ్వరరావు సైబర్ నేరాల్లో రకాలు, నేరగాళ్ల మోసాల గురించి వీడియోలు ద్వారా వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొల్లి రజిని, ఎంపీటీసీ తుమాటి భీమారాణి , ఏఎస్ఐ పోతురాజు, సిబ్బంది తాతారావు, కూర్మారావు, నాగబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'ఏసీసీ' కార్మికుల దీక్షలు



దీక్ష నిర్వహిస్తున్న ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమ గుడిసెలను ప్రభుత్వ అధికారులు అక్రమంగా కూల్చివేయడాన్ని నిరసిస్తూ చేపట్టిన దీక్షలు గురువారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల పోరాట కన్వీనర్ కూరపాటి స్టీవెన్ మాట్లాడుతూ కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలను కలుపుకొని పోరాటం ఉధృతం చేద్దామన్నారు. చట్టవిరుద్ధంగా కార్మికులు గుడిసెల కూల్చివేయించిన అధికారులు తగిన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకుడు వేముల దుర్గారావు మాట్లాడుతూ చట్ట విరుద్ధంగా అధికారులు వ్యవహరించడం సరి కాదని అన్నారు. కార్మికులు చేస్తున్న పోరాటానికి సీఐటీయూ పూర్తి సంఘీభావం తెలియజేస్తోందని అన్నారు. ఈ దీక్షా శిబిరంలో కూరపాటి దిబోరా రాణి, ఎం.శారద, జి.అన్నమ్మ, బి.నవనీతం, మల్లికాంబ, డి.రమణ, ఎం.ఆశీర్వాదం, బి.సూర్య ప్రకాష్, సుబ్బారావు, ఎం.గురవయ్య, యెహోషువా, ఎం.శివ మల్లేశ్వరి, పిచ్చయ్య, ఆర్.శివ, దానయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంటీఎంసీ కార్యాలయం వరకు పాదయాత్ర చట్టవిరుద్ధంగా అధికారులు తమ గుడిసెలు కూల్చివేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం ఉదయం 10 గంటలకు ఫ్యాక్టరీ దీక్షా శిబిరం నుంచి మంగళగిరి ఎంటీఎంసీ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించనున్నట్లు యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ తెలిపారు. ఈ పాదయాత్రలో కార్మికులందరూ పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

అలరించిన సంకీర్తన గానం

తెనాలి: పట్టణ నెహ్రూ రోడ్‌లోని శ్రీ రుక్మిణీ సమేత గోవర్ధనస్వామి, శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో గురువారం సాయంత్రం శ్రీ హరి నామ సంకీర్తన బృందం ఆధ్వర్యంలో సంకీర్తన గానం నిర్వహించారు. గురువు పెరవలి వంశీకృష్ణ, అందె బాలచంద్రమౌళి, అందె రాజేశ్వరి, తన్మయి, మాదలనాగఅర్చన, రూపశ్రీ, నందిపాటి దుర్గామల్లేశ్వరి, దంటు శర్వాణి, పువ్వాడ విష్ణు ప్రియ, శ్రీపూజిత, కొప్పురపు అనిత మాధవి, టీవీఎస్ శాస్త్రి పాల్గొన్నారు. శ్రీఆంజనేయస్వామి దేవస్థానం ప్రధాన అర్చకుడు లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో తిరుమల తిరుపతి దేవస్థానములు సహకారంతో 'వారం వారం భజన'లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొద్ది రోజుల్లో తిరుమలలో ఇదే బృందంతో భక్తిరంజని ఉంటుందని పెరవలి వంశీకృష్ణ చెప్పారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



తెనాలి రూరల్: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన తెనాలి రైల్వే స్టేషన్‌లో బుధవారం అర్ధ రాత్రి దాటాక చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సుమారు 40 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సున్న వ్యక్తి రైల్వే స్టేషనులోని మూడో నంబరు ప్లాట్‌ఫాం నుంచి నాలుగో నంబరు ప్లాట్‌ఫాంకు వెళ్లేందుకు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్టేషను మేనేజరు సమాచారం మేరకు జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాల మార్చురీకి తరలించారు.

తెలుగు సాహితీ లోకంలో విలక్షణ కవి 'బైరాగి'



నగరంపాలెం: తెనాలిలో జన్మించిన ఆలూరి బైరాగి తనదైన కంఠస్వరంతో తెలుగు సాహితీ లోకంలో విలక్షణ కవిగా రాణించారని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివ శంకర్ అన్నారు. గుంటూరు పుస్తక మహోత్సవ ప్రాంగణంలో అరసం ఆధ్వర్యంలో గురువారం సాహిత్య విమర్శకులు కందిమళ్ల శివప్రసాద్ అధ్యక్షతన బైరాగి శత జయంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ బైరాగి అత్యంత మౌలిక భావనలతో, స్వభావ సహజత్వం, నిసర్గ కవితాశక్తి, జీవతం పట్ల అపార ప్రేమ నిండిన కవిత్వం రాశారని తెలిపారు. సభలో అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి బుల్లా రవి పాల్గొన్నారు.

8న ప్రొఫెసర్ కంచె ఐలయ్య పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని చూపిస్తున్న డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, న్యాయవాది వైకే తదితరులు

గుంటూరు మెడికల్: ప్రొఫెసర్ కంచె ఐలయ్య షఫర్డ్ రచించిన 'ది క్షుద్ర రెబిలియన్' పుస్తకావిష్కరణను ఈనెల 8న సాయంత్రం 4 గంటలకు బ్రాడీపేట 4వ లైనులోని సింధూరి నిర్వహిస్తున్నట్లు ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు చెప్పారు. గుంటూరు అమరావతి రోడ్డులో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ వియ్యన్నరావు, ప్రముఖ న్యాయవాది వై.కోటేశ్వరరావు (వైకే), లేబర్ డిపార్టుమెంట్ అడిషనల్ సెక్రటరీ గంధం చంద్రుడు హాజరవుతున్నట్లు తెలిపారు. సాహిత్య అభిమానులు, సామాజిక కార్యకర్తలు పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనాలని న్యాయవాది వై.కోటేశ్వరరావు కోరారు. సమావేశంలో టి.సుబ్రహ్మణ్యం, వేముల రాజా, దాసరి తిరుపతిరావు, కె.కోటేశ్వరరావు, సాంబయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

లేడీస్ హాస్టల్ చీఫ్ వార్డెన్‌గా మాధవి

ఏఎన్‌యూ: నాగార్జున విశ్వవిద్యాలయ మహిళా వసతి గృహ చీఫ్ వార్డెన్‌తో పాటు అడిషనల్ చీఫ్ వార్డెన్, డెప్యూటీ వార్డెన్‌లను నియమిస్తూ వీసీ ఆచార్య కె.గంగాధరరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. చీఫ్ వార్డెన్‌గా బోటనీ అండ్ మైక్రో బయాలజీ విభాగ అధ్యాపకురాలు జె.మాధవి, అదనపు చీఫ్ వార్డెన్‌గా ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకురాలు వై.సునీత, ఫార్మసీ కళాశాల అధ్యాపకురాలు ఎస్. సుజనలను నియమించారు. డెప్యూటీ వార్డెన్లుగా ఏ.ఎస్.వి.రాధిక, వి. సుభాషిణి, టి. ఝాన్సీలను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇంజినీరింగ్ కళాశాల వసతి గృహాల చీఫ్ వార్డెన్‌గా అసిస్టెంట్ ప్రిన్సిపాల్ ఎం.గోపీకృష్ణ, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డి. చంద్రమౌళీలకు అడిషనల్ చీఫ్ వార్డెన్ బాధ్యతలు అప్పగించారు. డెప్యూటీ వార్డెన్లుగా ఆర్.విజయ్ ప్రకాష్, యు. సతీష్ కుమార్, కె.ఎస్. రాజశేఖర్, సీహెచ్. పుణ్యశేఖర్, బి. విజయ కుమార్‌ను నియమించారు. వీరు ఏడాది పాటు వార్డెన్లుగా విధులు నిర్వహించనున్నారు. నూతనంగా నియమితులైన వార్డెన్‌లకు వీసీ ఆచార్య కె.గంగాధర రావు, రెక్టార్ ఆచార్య కే. రత్నషీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలంలు ఉత్తర్వులు అందజేశారు.

బైక్ రేస్‌లు అరికట్టేందుకు చర్యలు



స్పీడ్ బ్రేకర్లు పరిశీలిస్తున్న డీఎస్పీ రమేష్, సీఐ సింగయ్య తదితరులు

పట్నంబజారు: నగరంలో బైక్ రేస్‌లు అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నామని ట్రాఫిక్ డీఎస్పీ ఎం.రమేష్ చెప్పారు. గుంటూరు నగరంలో పలు ప్రాంతాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు, ప్రమాద హెచ్చరిక బోర్డులను గురువారం పరిశీలించారు. మితిమీరిన వేగంతో ద్విచక్ర వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నందున పలు చర్యలు తీసుకున్నట్లు డీఎస్పీ రమేష్ తెలిపారు. కొరిటిపాడు – గుజ్జనగుండ్ల ప్రధాన రహదారిపై ఇరువైపులా ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. లక్ష్మీపురం, కొరిటిపాడు ప్రధాన రహదారి తదితర ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వేగ నియంత్రణ కోసం స్పీడ్ బ్రేకర్లు, స్టాప్ బోర్డు, ట్రాఫిక్, ట్రాఫిక్స్ కోన్స్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రధాన రహదారి వెంట సీసీ కెమెరాలతో నిరంతరం నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఎవరైనా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వేగంగా కన్న ప్రాణం మిన్న అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఆయన సూచించారు. రోడ్డు భద్రత గురించి విద్యార్థులు, యువతకు తల్లిదండ్రులు కూడా తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో ట్రాఫిక్ వెస్ట్ సీఐ సింగయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల ధోరణితో సమాజానికి ముప్పు



గుంటూరు ఎడ్యుకేషన్: రాయచోటి పట్టణం కొత్తపల్లిలోని ఉర్దూ పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడు ఎజాస్ అహ్మద్‌పై విద్యార్థులు దాడికి పాల్పడిన సంఘటనను యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు. రాజశేఖర్‌రావు, ఎం. కళాధర్ తీవ్రంగా ఖండించారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. విద్యార్థుల్లో పెడ ధోరణలు, దురలవాట్లు, నేర ప్రవృత్తి, అసాంఘిక ధోరణి పెరిగిపోవడం ఆందోళనకరమన్నారు. విద్యార్థుల తప్పులను సరి చేసే బాధ్యత ఉపాధ్యాయులది కాదా ? అని ప్రశ్నించారు. అయితే ప్రస్తుత పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉందన్నారు. ఉపాధ్యాయుడు ఎజాస్ అహ్మద్ మరణంపై న్యాయ విచారణ జరిపి, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా పాస్టర్ల సదస్సు

తాడేపల్లిరూరల్: క్రిస్మస్ మాసాన్ని పురస్కరించుకుని క్రైస్తవ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో గురువారం మంగళగిరి బాప్టిస్ట్ పేట లార్డ్ జీసస్ చర్చిలో పాస్టర్లకు సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు సమితి రాష్ట్ర అధ్యక్షుడు రెవరెండ్ కంతేటి లార్డ్ వెస్లీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ లోకంలో ఒక్కడే రక్షకుడు ఉన్నాడని, ఆయనే ఏసుక్రీస్తు అన్నారు. అనంతరం ప్రేమ విందు, కానుక కార్యక్రమాన్ని నిర్వహించారు. పాస్టర్లు సీహెచ్ డేవిడ్ గాంధీ, పి.డేవిడ్ రాజు, పి.విద్యాధర్, ఎన్.బాలస్వామి, ఎం.ఇశ్రాయేల్, స్పర్జన్ బాబు, రబ్బుని, డి.ప్రసాదరావు పాల్గొన్నారు.

ఎంపీటీఎం ఆకృతిలో హైస్కూలు విద్యార్థులు



ఎంపీటీఎం ఆకృతిలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

తెనాలి: ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 7వ తేదీన జరగనున్న మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ (ఎంపీటీఎం) పురస్కరించుకుని స్థానిక ఎస్ఎస్ఎస్ మున్సిపల్ హైస్కూలులో గురువారం వినూత్న కార్యక్రమం చేపట్టారు. హైస్కూలుకు చెందిన 300 మంది విద్యార్థులతో ఎంపీటీఎం ఆకృతిని ఏర్పాటు చేశారు. చిత్రకళా ఉపాధ్యాయుడు బెల్లంకొండ వెంకట్ ఆధ్వర్యంలో పీఈటీ శ్రీనివాసరావు సహకారంతో ఏర్పాటైన ఆకృతిలో విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి భారత్‌మాతాకీ జై అని నినదించారు. 7న తల్లిదండ్రులకు, మహిళలకు ముగ్గుల పోటీలు, పురుషులకు టగ్‌ఆఫ్‌వార్ పోటీలను నిర్వహిస్తామని, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి శుభదాన్ భోజనం కూడా ఉంటుందని కార్యక్రమాన్ని పర్యవేక్షించిన ఇన్‌ఛార్జి హెచ్ఎం సునీత తెలియజేశారు. ప్రసాద్, నవీన్, ప్రేమ్, మనోజ్, విజయ్‌సింహ, జాన్‌బీ, బాలమ్మ, కరిముల్లా, విజయలక్ష్మి, రాబియా భాసం, సంపూర్ణ, వెంకటరమణ, ఎస్ఎంఈ చైర్మన్ గాలి కిరణ్ పాల్గొన్నారు.

రీ సర్వేకు ప్రజలంతా సహకరించాలి



తెనాలి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తెనాలి పట్టణంలో భూములకు సంబంధించిన రీసర్వే జరుగుతుందని, ప్రజలందరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న కోరారు. తహసీల్దార్ కార్యాలయం ఆవరణను గురువారం సాయంత్రం రీసర్వే చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాశ్వత భూ హక్కు పథకంలో భాగంగా తెనాలి పట్టణంలో రీసర్వేను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మొదట ప్రభుత్వ భవనాలను, తరువాత ప్రైవేట్ ఆస్తులను రీసర్వే చేయనున్నట్లు వెల్లడించారు.కార్యక్రమంలో తహసీల్దార్ గోపాలకృష్ణ, ఏసీపీ శివన్నారాయణ, పలువురు టౌన్ ప్లానింగ్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.